గాఢంగా ఒక దమ్ము లాగి స్వర్గపు టంచులను చవి చూస్తున్నట్లుగా తన్మయత్వంలో ఉన్నాడు సంజీవరెడ్డినగర్ బస్ స్టాపు దగ్గర శేఖర్. ఆ తన్మయత్వాన్ని భంగపరుస్తూ, "ఏరా, నాయనా! మోడలింగ్ ప్రొఫెషన్‌లోకి దూకాలనుకుంటున్నావా... మంచి మంచి పోజు లిస్తున్నావు ఈ మధ్య?" పలకరించాడు రవి.

"అదేం కాదోయ్, మనం తాగుతున్న దేమిటి? సిగరెట్. సిగరెట్ ఎందుకు తాగుతాం? ఎంజాయ్‌మెంట్ కోసం. కాబట్టి మనం సిగరెట్‌ను సరిగ్గా ఎంజాయ్ చేస్తున్నా మన్న మాట. సిగరెట్ తాగుతూ ఏదో చేదు మందు తప్పనిసరియై తాగుతున్నట్లు ఫీల్ కాకూడదు. అది ధూమపానానికే మహా ద్రోహం చేసినట్లవుతుంది." కాళ్ళూ, చేతులూ ఊపుకుంటూ మంచి హుషారుగా చెప్పాడు శేఖర్. ఇంతలో 9-కె బస్సు వేళ్ళాడుతున్న జనంతో ఇండియా స్వరూపాన్ని ప్రతిబింబిస్తూ నెమ్మదిగా వచ్చి ఆగింది. విడుదలయిన మొదటి రోజున సినిమా టికెట్ల కోసం ఎగబడుతున్న జనంలాగా లాక్కుంటూ, పీక్కుంటూ లోపలి కెళ్ళారు కొంతమంది. రవి, శేఖర్‌కూడా దూరేశారు. తట్టుకోలేని ముసలీ ముతకా ఇంకో బస్సొస్తుందిలే అనే ఆశతో నిల్చొని చూస్తున్నారు- ద్రవ్యోల్బణంతో పోటీ పడలేని సామాన్య జనంలా.

"అబ్బబ్బ! ఎన్ని బస్సు లొస్తున్నా రద్దీ మాత్రం తగ్గట్లేదు." బస్సులో నిలబడలేని ఓ ముసలాయన బాధ.

"ముప్పై లక్షల మూతులున్న హైదరాబాదులో అది దా సహజం." సీటులో కూర్చున్న ఓ అయ్యరుగారి కామెంటు.

అలా రకరకాల సంభాషణలు, కామెంటులు వినబడుతున్నాయి బస్సులో. అన్నిటినీ మించిపోయింది "లకడీకాపూల్, టెలిఫోన్ భవన్, లకడీకాపూల్, టెలిఫోన్ భవన్" అన్న కండక్టరు కేక.

శేఖరు, రవి లకడీకాపూల్‌లో దిగారు. వాళ్ళిద్దరూ ఓ గవర్నమెంటు ఆఫీసులో టైపిస్టు ఉద్యోగం చేస్తున్నారు. నలుగురు ఆడ ఉద్యోగులు, అయిదుగురు మగ ఉద్యోగులతో ఎప్పుడూ కళకళ లాడుతూంటుంది వాళ్ళ సెక్షను. సెక్షను ఆఫీసర్ జానకిరామయ్యగారు చాలా మంచివాడు. జూనియర్లలో ఉన్న లోటుపాట్లన్నిటినీ కుటుంబ పెద్దలాగా చక్కగా సర్దుకు పోతుంటాడు. జానకిరామయ్యగారి సెక్షనంటే అసలు ఆఫీసులా ఉండదు. ఓ చక్కని ఫామిలీ సెంటిమెంటు చిత్రంలా ఉంటుంది. పుస్తకాలు చదువుకునే వాళ్ళూ, జోకు



# నవ్వింది మల్లె-చెండు

పసుపులేటి మాధవ రావు



లు చెప్పుకొని నవ్వుకునేవాళ్ళూ... ఇంకా చెప్పా లంటే ఓ కల్చరల్ క్లబ్‌లాకూడా ఉంటుంది. పాపం, జానకిరామయ్యగారు మాత్రం తన పనిలో తాను ఎప్పుడూ తలమునకలై ఉంటాడు. ఆయన సీట్లో కూర్చున్నాడంటే సామాన్యంగా తల పైకెత్త డు, ఎవరితోనైనా మాట్లాడాలంటే తప్ప.

శాంతి ఇచ్చిన లీవ్ అప్లికేషన్ చేత్తో పట్టుకొని తల పైకెత్తాడు. "మిస్ శాంతీ! మీకు పెళ్ళ యిందా?"

"అదేమిటీ, సార్! మిస్ అని పిలుస్తూనే పెళ్ళ యిందా అని అడుగుతారే?" అంది శాంతి.

"మరి పెళ్ళికాని వాళ్ళకూ్కడా నేను మెటర్నిటీ లీవు ఎట్లా గ్రాంటు చెయ్యను?"

ఫక్కున నవ్వి, "సారీ, సార్! పొరపాటు పడుంటుంది. నిన్న టైపు చేసేటప్పుడు రాధ, నేను మెటర్నిటీ లీవు గురించి మాట్లాడుకున్నాం- అందుకే అలా పడుంటుంది." చెప్పింది శాంతి.

"అవునవును. పెళ్ళయిన వాళ్ళకి మెటర్నిటీ లీవులు ఇస్తుంటేనే స్టాఫ్ షార్టేజి కనబడుతుంది. ఇక పెళ్ళి కానివాళ్ళకూ్కడా గ్రాంటు చేస్తే..." అప్పుడే ఆఫీసులో అడుగు పెడుతున్న బ్రహ్మా నందం అందుకున్నాడు.

"ఇప్పుడు మిమ్మల్నెవ్వరూ అడగలేదు." మూతి విరిచింది శాంతి. "చూడండి, శాంతిగా రు! అలా కోపగించుకుంటే లాభం లేదు. నేను ప్రజా సేవకుణ్ణి కాబట్టి అందరి విషయాలతో నాకు సంబంధం ఉన్నట్టే." సమర్థించుకున్నాడు బ్రహ్మానందం.

"మాటల్లోనే ప్రజా సేవ!" రాధ కామెంటు.

"బాగా చెప్పారు." రవి సపోర్టు.

అలా అందరూ రకరకాలుగా మాట్లాడుకుంటు న్నా, నిర్మల మాత్రం ఏమీ పట్టించుకోకుండా తన పనిలో తాను నిమగ్నమై ఉంది.

నిర్మల-పేరుకు తగినట్లుగానే నిర్మలంగా ఉంటుం దామె మనసు. చక్కటి ముఖ వర్ఛస్సు. ఒక మాదిరి ఎత్తు. ఎత్తుకు తగిన లావు. అప్సరస కాకపోయినా, అవయవాలన్నీ ఉండవలసిన చోట ఉన్న వనిత. ఆ సెక్షనులో ఉన్న ఆడవా ళ్ళందరిలోకి అందగత్తె. అందుకే శేఖర్ కళ్ళెప్పు డూ ఆమె మీదే ఉంటాయి. నిర్మల ఉద్యోగంలో చేరి వారం రోజులు తక్కువగా సంవత్సర మయింది. ఆఫీసులో జాయినయిన తరవాత ఆమె నవ్వగా చూసిన వాళ్ళెవరూ లేరు ఇంతవ రకూ. నిర్మల సీటు పక్కనే శేఖర్ సీటు. నిర్మలను నవ్వించాలని ఎంతో ప్రయత్నం చేస్తూ టాడు శేఖర్. కాని, అతని జోకులన్నీ తడిసిన సీమ టపాకాయల్లా పేలుతుంటాయి ఆమె ముందు. మిగిలిన వాళ్ళందరూ విరగబడి నవ్వు తుంటారు అవే జోకులకు.

"రవీ! ఈ రోజు నీ కో మంచి జోకు చెప్పాలను కుంటున్నాన్రా" అన్నాడు శేఖర్, యథావిధిగా తన ప్రయత్నాన్ని కొనసాగించే ఉద్దేశంతో.

"తోడేలుకి మేకలాగా నేనేగా నీ నత్తు జోకు లన్నింటికి దొరికేది. కానియ్" అన్నాడు రవి సరదాగా.

"మా ఊళ్ళో గరటయ్య అనేవా డుండేవాడు. అతను ఒక రోజు తన భార్యతోపాటు డాక్టరు దగ్గర కెళ్ళి- "డాక్టరుగారూ, డాక్టరుగారూ! మా ఆవిడ నాలుగు రోజులనుండి గేదె లాగఅ అరుస్తోం దని చెప్పాడు. నాలుగు రోజులనుండి అలా ఉంటుంటే డాక్టరుకు చూపించకుండా ఏం చేస్తు న్నావని కోప్పడ్డాడంట ఆయన. అప్పుడు మన గరటయ్య- అదికాదు డాక్టరుగారూ, గేదెలా అరు స్తుంది గదా- అన్నం మానేసి గడ్డి తింటుందేమో నని చూస్తున్నాను అన్నాడంట." జోకు పూర్తవగా నే నవ్వుల జల్లు కురిపించారు అందరూ- నిర్మల మినహా.

శేఖరరకు ఒళ్ళు మండిపోయింది. అందరూ నవ్వుతుంటే త నొక్కతే అలా బిగుసుకొని రాయి లా కూర్చుంటుందే. ఒక్కసారి నవ్వితే ఏం కొంప మునుగుతుందా. లేక నోటి ముత్యా లేమన్నా రాలిపోతాయా. అసలు మనిషి కేమన్నా చలనం ఉందా? ఉక్రోష పడుతున్నాడు లోలోపల. "ఛాయ్ బాయ్ గాడి కేమైం దివాళ- ఇంకా రాలేదు." విసుక్కుంటూ అన్నాడు శేఖర్, జోక్ పని చెయ్య లేదన్న బాధతో.

"వా డెటూ రాలేదుగా- అలా బయటికన్నా వెళ్ళి తాగుదాం పదరా" అంటూ లేచాడు రవి.

ఇద్దరూ కలిసి బయట కెళ్ళారు.

"ఒరే, శేఖరూ! నువ్వీ నిర్మలని నవ్వించే ప్రయ త్నం మానుకుంటావా, లేకపోతే నన్ను రిజైన్ చెయ్యమంటావా?" కోపంగా అన్నాడు రవి.

"కోగించుకోకురా, నాయనా, కాస్త శాంతించు."

"లేకపోతే వెధవ ప్రయత్నమూ , నువ్వూనూ. నీతో సహకరించలేక నేను చస్తున్నాను మధ్యలో. అయినా, ఆ మహాతల్లి నవ్వకపోతే వచ్చిన నష్టమే మిటి? భూమండలం ఏమన్నా బద్దలైపోతుందా? ఈ నత్తు కోరిక నీ కెట్లా పుట్టిందిరా?"

"తప్పు, తప్పు. అది కోరిక కాదు. పవిత్రమైన ఆశయం."

"బోడి ఆశయం, నువ్వూను. సుష్టుగా మూ డు పూట్లా జింజర్ చికెన్‌తో భోజనం చెయ్యాలనో, రోజూ బార్‌లో పారు కొట్టాలనో, చిరంజీవి సినిమా మొదటి రోజు మార్నింగ్ షోనే చూడాలనో ఆశయా లుగా పెట్టుకుంటే తప్పులేదు. కాని, ఉలుకు ,పలుకు లేని రాతి స్వభావాన్ని నవ్వించాలనుకో పటం మహాపరాధంరా, బాబూ!"

"ఆగవోయ్ ఆగు. ఇంకొక్క వారం రోజులు ఆగు. ఒక్క వారం రోజులలోపు తప్పకుండా నవ్విస్తాను."

"ఇదిగో చూడూ... మగవారికి కడుపొస్తుం దన్నా నమ్ముతానేమో కాని, ఆ జిడ్డు ముఖం నవ్వు తుందంటే నే న్నమ్మను." వాదించాడు రవి.

"అయితే ప్రతిజ్ఞ చేస్తున్నాను. ఖచ్చితంగా వారం లోపల నవ్వించలేకపోతే ఇక నా ప్రయ త్నం పూర్తిగా మానుకుంటాను. అంతేకాదు,నా జన్మలో జోకంటూ వెయ్యను. సరేనా?" ప్రతిజ్ఞ చేశాడు శేఖర్.

చాయ్ పూర్తి చేసి సెక్షనులో కొచ్చారు రవి, శేఖర్.

టైము పదకొండూ ముప్పై అయింది. నీటుగా పక్కపాడి నెమరేసుకుంటూ ఒక చంకకి సంచీ వేలాడేసుకుని సుష్టుగా విందు భోజనం చేసిన పురోహితుడిలా నెరుముకుంటూ నెరుముకుంటూ ఎ.స్.ఓ. టేబుల్ దగ్గర కొచ్చాడు భూషణం. అతని చూపులు అటెండెన్సు రిజిస్టరు కోసం

వెదుకుతున్నాయి. అది గమనించిన జానకిరామయ్య- 'పదిన్నరకు ఆఫీసయితే ఏదో సరదాగా క్లబ్బు కొచ్చినట్లు రోజూ పదకొండూ ముప్పైకి వస్తాడు' అని లోలోపల తిట్టుకుంటూ, "అటెండెన్సు ఇప్పుడే ఆఫీసరుగారి గదిలో కెళ్ళింది, సార్!" అన్నాడు.

"ఆఫీసరు గదిలోకి వెళ్ళిందా, పంపించారా?" అంటూ హ్హి హ్హి హ్హి అని నవ్వాడు. గమిడి గేదె అరిచినట్టుగా ఉందా నవ్వు. మళ్ళీ- "అయినా, పదకొండున్నరకే అటెండెన్సు లోపలికి పంపిస్తే ఎట్లా, సార్" అంటూ సంతకం పెట్టటానికెళ్ళాడు భూషణం.

ఏం చెప్పాలో అర్థంకాక తెల్ల మొహం వేసి అలాగే చూస్తూండిపోయాడు భూషణం వంక.

ఆఫీసులో తన ముందు జరుగుతున్న వ్యవహారాలన్నీ చూస్తూంటే జానకిరామయ్యకు పిచ్చెక్కుతుంది. ఎంత పట్టనట్టు ఊరుకున్నప్పటికీ మనసు బాధడుతూనే ఉంది. భూషణం వేసిన డైలాగు నుంచి తేరుకోకముందే- "హల్లో! లంగా, వెల్‌కమ్, వెల్‌కమ్" అంటూ సీటులోంచి లేచి ఎదురుగా వస్తున్న వ్యక్తిని కౌగలించుకున్నాడు శేఖర్.

ఛీ! అస లిది ఆఫీసా, పిచ్చాసుపత్రా అనిపించింది జానకిరామయ్యకు. 'ఇక్కడున్న నుత్తి కేసులతోనే నేను సతమత మవుతుంటే మళ్ళీ వీడెవడు లంగా గాడు' అనుకున్నాడు తనలో.

పైగా శేఖర్ అంతటితో ఊరుకోక "రారా! మా ఎ.సి.ఓ.గారికి పరిచయం చేస్తాను" అని, "జానకిరామయ్యగారూ! ఇతను నా బెస్ట్ ఫ్రెండ్ మిస్టర్ లంగా!" అంటూ పరిచయం చేశాడు.

"గ్లాడ్‌టు మీట్ యు, మిస్టర్ లంగాగారూ" అని అదో రకంగా చూస్తున్నాడు జానకిరామయ్య ఇదేం పేరన్నట్లుగా.

"ఏం, సార్, అలా చూస్తున్నారు... పేరు కొత్తగా ఉందనా! అది మాకూ లు పేరేలెండి. అత నింటి పేరు లంకపల్లి-, అతని పేరు గాంధి. అందుకని పొట్టి అక్షరాలలో ముద్దుగా 'లంగా' అని పిలుచుకుంటాం" అన్నాడు శేఖర్.

"ఆఁ దానిదేముందిలే? ఇటువంటి పేర్లు ఈమధ్య చాలా వినవడుతున్నాయ్. మొన్నో కుర్రాడు ఇంకొకతన్ని 'దోశ', 'దోశ' అని పిలుస్తున్నాడు. అదేం పేరయ్యా అనడిగాన్నేను. వాళ్ళింటి పేరు దొగివర్తి-, అతని పేరు శరత్- వెరశి 'దోశ' అని చెప్పాడా కుర్రాడు." మధ్యలో అందుకున్నాడు రవి. 'కర్మరా, నాయనా' అనుకుంటూ మొహమాటానికి ఓ చిరునవ్వు నవ్వి తన పనిలో తల దూర్చాడు జానకిరామయ్య.

"కొంచెం బయటి కెళ్ళొస్తాను, సార్, మా ఫ్రెండ్ కదొచ్చాడు గదా" అని చెప్పి బయట కెళ్ళాడు శేఖర్.

** ** **

ఆరు రోజులు గడిచిపోయినయ్. ఒకే ఒక్క రోజుంది శేఖర్ తన పంతం నిలుపుకోవటానికి. సంవత్సరం నుంచి చెయ్యలేని పని ఒక్క రోజులో చెయ్యలేడని తనకు తెలుసు. అయినా, ఆఖరి బాణంగా భూషణాన్ని ప్రయోగిద్దా మనుకున్నాడు.

భూషణం జనరల్ నాలెడ్జిలో పరమ శుంఠ. అయినా తన కన్నీ తెలుసు నన్నట్లు పోజు పెడుతుంటాడు- ఎక్కడున్నా ఎవరన్నా చెప్పుకునవి విన్నప్పుడల్లా.

రోజూ పదకొండున్నరకు వచ్చే భూషణం ఆ రోజు పదిన్నరకల్లా ఆఫీసులో అడుగు పెట్టేటప్పటికల్లా ఇవాళ ఏదో అవుతుంది అనుకున్నారు అందరూ. అలా అనుకోవటంలో తప్పు లేదు. ఒక రోజు భూషణం హఠాత్తుగా టైముకి ఆఫీసు కొచ్చాడు. అరగంట కల్లా ఇందిరా గాంధిని కాల్చి చంపారనే వార్త అందరి చెవిన పడింది. మరి ఈ రోజు ఏం వింటామో అని అందరూ అనుకుంటున్నారు.

ఉన్నట్టుండి భూషణం- "అద్భుతం" అన్నాడు.

"ఏమిటి తమ రివాళ ఆఫీసుకి టైముకి రావటమా" అడిగాడు శేఖర్. "అదొక టనుకో- ఇంకొకటుంది."

"ఏమి టది?" శేఖర్.

"నిన్న నజీరుద్దీన్‌షా వరసగా తన మూడో సెంచరీ చేసి ప్రపంచ రికార్డు సృష్టించాడు- అదే అద్భుతం." ధీమాగా చెప్పాడు భూషణం.

అందరూ గొల్లున నవ్వారు.

"ఏమిటి! ఎందుకు నవ్వుతున్నారు. నిజం... అబద్ధ మనుకుంటున్నారా!" అన్నాడు భూషణం.

"ఏమిటి, నిజం? నజీరుద్దీన్‌షా మూడో సెంచరీ చేశాడా! క్రికెట్ గురించి నువ్వు మాకు



daCunha/AS/27/84/TL

చెప్తున్నావా!" అన్నాడు రవి.

భూషణం షేమ్ ఫీలయ్యాడు. అంతకు ముందు బస్సులో స్టూడెంట్సు చెప్పుకుంటున్నది వినటంలో పొరబాటు పడుంటా ననుకున్నాడు.

"సారీ... సారీ! మూడవ సెంచరీ కాదు, రెండవ సెంచరీ." మళ్ళీ అన్నాడు పొరపాటు పడిన వాడిలా. మళ్ళీ నవ్వులు మిన్ను ముట్టాయి.

"ఏమిటి- ఎందుకు నవ్వుతున్నారు? మీ రెందుకు నవ్వుతున్నారో నా కర్థం కావటంలా...చెప్పండి" అన్నాడు అయోమయంగా.

"ఎందుకా? నజీరుద్దీన్‌షా అన లెవరో తెలుసా నీకు?" అడిగాడు శేఖర్.

"ఆఁ తెలియక పోవట మేమిటి- ఇండియా టీములో కొత్త ప్లేయరూ!" అన్నాడు మాత్రెండేగా అన్నట్లు.

మళ్ళీ నవ్వులు. అందరూ అలా నవ్వలేక బాధ పడుతుంటే త నేదో తప్పు చెబుతున్నట్లు గమనించి, బహుశా అతను టెన్నిస్ ప్లేయరయ్యుంటా డనుకొని-

"సారీ... సారీ! అతను టెన్నిస్ ప్లేయరు గదూ- పొరబాటున క్రికెట్ ప్లేయ రన్నాను."

మళ్ళీ నవ్వులు.

ఇంతలో రవి కల్పించుకొని- "ఇదిగో, భూషణం! ఇక నువ్వు ఆవకపోతే మాపొట్టలు పగిలేటట్లున్నాయ్. మొదటి మూడు టెస్టుల్లో సెంచరీలు చేసింది నజరుద్దీన్‌షా కాదు, అజరుద్దీన్. నజరుద్దీన్‌షా గొప్ప హిందీ నటుడు. క్రికెట్ ప్లేయరూ కాదూ, టెన్నిస్ ప్లేయరూ కాదు తెలిసిందా?" అన్నాడు.

"ఆఁ. అదే లేవయ్యా, మాటల్లో పొరపాటు- అజరుద్దీన్ అనబోయి అలా అన్నాను- అంతే." ఛాన్సు దొరికింది కదా అని నమర్థించుకున్నాడు భూషణం.

"ఒరేయ్, రవీ! భూషణా న్నలా తీ సెయ్యకురా ఏదో కంగారు పడ్డాడు కాని, జనరల్ నాలెడ్జి బాగానే ఉం దతనికి. కావాలంటే ఇంకో ప్రశ్న అడుగుతాను చూడు టకామని చెబుతాడు" అన్నాడు శేఖర్.

ఔనన్నట్లు గంగిరెద్దులా తలూపాడు భూషణం.

"మైకేల్ ఏంజిలో ఎవరో చెప్పు? అప్పుడయినా నీ నాలెడ్జి గురించి వీళ్ళకు తెలుసొస్తుంది" అన్నాడు శేఖర్.

మైకేల్ ఏంజిలో... మొత్తంమీద పేరు ఎక్కడో విన్నదే! ఎవరైయ్యుంటాడు బాక్సరా? కాదు, కాదు. వీళ్ళు బహుశా క్రికెట్ గురించే అడి గుంటారు. ఈ పేరు ఇండియా వాడిదిలా లేదు. అతను అమెరికన్ అయ్యుంటాడు. అని మనసులో అనుకొని-.

"ఆఁ! అమెరికా క్రికెట్ టీమ్ కేప్టెన్." ఈమాత్రం తెలియదనుకున్నావా అన్నట్లు చెప్పాడు భూషణం. భూషణం తెలివి తేటలకి కడుపుబ్బేలా నవ్వుకున్నా రందరూ.

"ఓరి, బుజ్జినాయనా! అసలు అమెరికాకు క్రికెట్ టీమే లేదురా." వస్తున్న నవ్వును ఆవుకుంటూ చెప్పాడు శేఖర్.

మొహం మాడిపోయింది భూషణానికి. అక్కడుండి నలుగురితో నవ్వలేక, ఆఫీసు హాస్య మహాసభలా తయారయినందుకు ఏడవలేక లేచి బయటకు వెళ్ళాడు జానకిరామయ్య.

సెక్షనంతా గందరగోళంగా ఉన్నా నిర్మల మాత్రం ఏమీ వినవడనట్టు మౌనంగా తన పని తాను చూసుకుంటూ కూర్చుంది. శేఖర్ ప్రయోగించిన భూషణాస్త్రంకూడా ఆవిడ ముందు పని చెయ్యలేదు.

అందరూ నవ్వులు చాలించి కాసేపన్నా పని చెయ్యకపోతే బాగుండదన్నట్లుగా పని చెయ్యటం మొదలెట్టారు. శేఖర్ మాత్రం ఓడిపోయిన ఎమ్.ఎల్.ఎ. లాగా తల పట్టుకొని కూర్చున్నాడు. టైము సాయంత్రం అయిదు అయింది. ఆఫీసంతా నిశ్శబ్దంగా ఉంది.

ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అద్భుతమైన నవ్వు వినిపించింది. అందరూ తలెత్తి చూశారు. ఆ నవ్వు నిర్మలది. నిర్మలమైన నవ్వు. జలతరంగిణి లాంటి నవ్వు. ముత్యాల గలగలల నవ్వు. లతా మంగేష్కర్ పాట లాంటి నవ్వు. చిట్టిబాబు వీణా వాద్యం లాంటి నవ్వు. విజయగర్వంతో పెల్లుబికి వస్తున్న నవ్వు. ఎన్నడూ నవ్వని నిర్మల అలా సాగర హొరులా నవ్వుతుంటే సెక్షనులో అందరూ ఆశ్చర్యపోయి చూస్తున్నారు.

రవి సీటులోంచి ఎగిరి గంతేశాడు- "ఒరే, శేఖర్! నిర్మలరా... నవ్వుతుందిరా! వినవడటం లేదట్రా నువ్వే గెలిచావురా! తలెత్తరా! చూడరా" అంటూ శేఖర్‌ని బలవంతంగా లేపాడు.

"లేదురా రవీ, లేదు. నేను గెలవలేదు. నిర్మలే గెలిచింది" అన్నాడు శేఖర్.

"ఏమిట్రా ను వ్వనేది? నిర్మల గెలవట మేమిటి?"

"అవున్రా! నిర్మల, నేను క్లాస్‌మేట్స్. చదువుకునే రోజుల్లోనే ప్రేమించుకున్నాం. ఉద్యోగాలు నంపాదించిన తరవాత పెళ్ళి చేసుకుందా మనుకున్నాం. నిర్మలకి అపాయింట్‌మెంట్ వచ్చినప్పుడు అనుకోకుండా మాకో పందెం పడింది. ఆమె కో అన్నయ్యున్నాడు. అతను చాలా వింత మనిషి. ఆరు నెలలపాటు ఒక్కసారికూడా నవ్వకుండా ఉన్న అమ్మాయిని పెళ్ళాడా లనేది అతని కోరిక. అందుకోనం అతను పట్టు పట్టి సెన్సస్ డిపార్టుమెంటులో ఉద్యోగం నంపాదించి జనాభా లెక్కలతోపాటు నవ్వుల లెక్కలుకూడా మొదలెట్టాడట. ఆయన పెళ్ళితోపాటే మన పెళ్ళికూడా జరుగుతుందని నవ్వుతూ అన్నది నిర్మల ఆ రోజున. అట్లయితే మన పెళ్ళి అయినట్లే- ఆరు నెలలపాటు నవ్వకుండా ఉండే అమ్మాయి ప్రపంచంలో ఎక్కడా దొరకదన్నాను, నేను. తప్పకుండా దొరుకుతుం దంది నిర్మల. అసంభవ మన్నాను నేను. ఆ మాటలు పెరిగి పెరిగి పందెంగా మారినయ్. సంవత్సరంపాటు అసలు నవ్వకుండా ఉంటానంది. తను ఏ రోజున ఓడిపోతే ఆ రోజునుంచి మా పెళ్ళి నా ఇష్టం వచ్చిన రోజున జరగాలి. నేను ఓడిపోతే వాళ్ళన్నయ్య పెళ్ళి దాకా ఆగాలి. అదీ పందెం. చివరకు తనే గెలిచింది. ఇక మా పెళ్ళి ఆ ప్రపంచ వింత మనిషి చేతుల్లో ఉంది. నా బతుకు బ్రహ్మచారిగానే తెల్లారాలేమో!" నిట్టూర్చాడు శేఖర్.

*

